# నాగరికము

## శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

వెంకటేశ్వర్లు మలకాపురము నుంచి సైకిలుమీద లేడీడాక్టరు కొరకు టౌనులోనికి వచ్చాడు.

అతడి భార్య శకుంతల గత రాత్రినుండీ ప్రసవవేదన పడుతున్నది.

ఇంట్లో ఉన్న వాళ్లందరూ ఆతురతతో తలకొక మాట అంటున్నారు. కొందరు ఆసుపత్రికి తీసుకొని వెళ్లితే మంచిదంటున్నారు, ఎంతడబ్బు ఖర్చు అయినా డాక్టరును ఇంటికి తీసుకొనివస్తే మంచిదంటున్నారు కొందరు. వెంకటేశ్వర్లకు ఎటూ తోచక-ఎంత ఖర్చు అయినా వైద్యురాలిని ఇంటికి తీసుకొని వెళ్లితేనే మంచిదేమోనని టౌనుకు వచ్చాడు.

డాక్టరు పంకజవల్లీ శర్మ మంచి హస్తవాసిగల వైద్యురాలు. కానుపు కేసులలో ఇంతవరకూ ఆమెకు అపజయమన్నదిలేదు. ఆమె పేరు గ్రామ గ్రామాలలో ప్రాకిపోయింది. నాలుగు సంవత్సరాల క్రిందట నేత్రవైద్యములో ప్రవీణుడైన రామశర్మను వివాహము చేసుకొన్నది. డాక్టరు పంకజవల్లీశర్మ అంటే అక్కడి మహిళామణుల కందరికీ ఎంతో అభిమానము. విద్యావంతురాలనీ-విజ్ఞానవంతురాలనీ వైద్యములో సాటిలేని ప్రజ్ఞకలదనీ ఆమె నొక దేవతగా భావించేవారు. అక్కడ మహిళా సంఘము పక్షమున స్థాపించబడిన ఫ్యామిలీ ప్లానింగు సెంటర్లలో వారానికి రెండుపర్యాయములు ఉపన్యసించ వలసినదని ఎంతగానో ప్రాధేయపడి ఆమెను ఏర్పాటు చేసుకొన్నారు.

ఉపన్యాసాలు విన్నవారు ఆమె వచోమాధుర్యానికీ-విషయ వైశద్యానికీ సమ్మోహితులై పోయేవారు.

ఆమె ఉపన్యాసాలను గురించి ఎప్పటికప్పుడు వెంకటేశ్వర్లూ శకుంతలా పత్రికలలో చదువుతూ ఉండేవారు. టౌనులోనికి రాగానే వెంకటేశ్వర్లకు డాక్టరు పంకజవల్లీ శర్మపేరు తటాలున జ్ఞాపకమువచ్చి ఆమె యింటికి వెళ్లాడు. ఆమె ఏదో పనిమీద బైటికి వెళ్లినదనీ ఒక గంట సేపటిలో వస్తుందనీ తెలిసింది.

ఉదయము తొమ్మిది గంటలకు ఇంటినుంచి బయలుదేరాడు వెంకటేశ్వర్లు. అప్పుడే పదకొండు గంటలు దాటిపోయినాయి. అతడిని ఆకలి ఒకప్రక్కనా-శకుంతలను గురించిన ఆతురత ఒక ప్రక్కనా వేధించ నారంభించినవి. ఇంకొక గంట అంటే డాక్టరు పన్నెండు గంటలు దాటితేనే గాని రాదు!

డాక్టరు వచ్చేవరకూ క్షణమొక యుగముగా లెక్కించుకుంటూ—వాకిటి వరండాలో పచారు చేయటము మొదలు పెట్టాడు వెంకటేశ్వర్లు.

సుమారు ఒంటిగంటకు డాక్టరు పంకజవల్లీ శర్మ కారు పోర్టికోలోకి వచ్చి ఆగింది. ఆమె కారు దిగుతుండగానే ఎదురుగా వెళ్లి తన సంగతిని చెప్పుకున్నాడు వెంకటేశ్వర్లు. ఒక అరగంటలో వస్తానని



ఆమెలోపలికి వెళ్లింది.

అరగంట-ముప్పావుగంటగడచిపోయినది గాని వైద్యురాలు బయటకు రాలేదు.

భార్యను గురించి ఆందోళన పడుతున్న వెంకటేశ్వర్లకు ఆమె చేస్తున్న ఆలస్యానికి విసుగుపుట్టుతున్నది. కానీ మరొకసారి ఆమెను పిలిచి తొందర పెట్టితే 'పల్లెటూరివాడని' అంటుందేమోనని భయపడి తలుపు దగ్గరగా గోడకు ఆనుకొని నిలువబడ్డాడు వెంకటేశ్వర్లు.

లోపలినుంచి ఏవో మాటలు వెంకటేశ్వర్లకు అస్పష్టముగా వినిపించాయి.

"నేను ఆలస్యముగా వచ్చానని కోపము వచ్చిందా?...ఆఁ?...ఎందుకూ అంత కోపము?" ఎంతో బుజ్జగిస్తున్నట్లు గా-బ్రతిమిలాడుతున్నట్లుగా ఉన్నదా కంఠధ్వని. ఆ ధ్వని డాక్టరు పంకజవల్లీ శర్మది.




కోపము వచ్చిన భర్తను బ్రతిమిలాడుతున్నది కాబోలు-ఆమె ఎంతటి విద్యావతి అయినా-ఎంతడబ్బు సంపాదించి పేరు తెచ్చుకుంటున్నా-భర్తను బ్రతిమిలాడుకొని ప్రాధేయ పడటము స్త్రీకి తప్పదు కదా అనుకున్నాడు వెంకటేశ్వర్లు. 'విక్టోరియారాణితో-ఆల్బర్టు అప్పుడప్పుడు తగాదాపడి-ఇలాగే బ్రతిమిలాడించుకొనే వాడట! ఎట్లాగయినా పురుషుడు పురుషుడే!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు.

ఆగదిలోని సంభాషణను చివరవరకూ వినవలెనని వెంకటేశ్వర్లకు కుతూహలము కలిగి - తలుపుకుచెవి ఆనించి వినటము మొదలు పెట్టాడు.

"నేను యింటికి రావటము ఆలస్యమైనదని దానికెంతకోపము వచ్చిందో చూశారా? నేను అక్కడికి వెళ్లానన్న మాటేగాని-నా ప్రాణమంతా దీని మీద నేకొట్టుకొని పోయిందంటే నమ్మండి....చూడండి. నేను బిస్కట్లు యిస్తే తీసుకోదుట...దగ్గరికి రమ్మంటే రాదుట...పోనీ... మీరు దగ్గరికి పిలిచి కూర్చొబెట్టకోండి. ముఖము చిన్నబుచ్చుకొని...ఆ మూలకు వెళ్లి ఎట్లా నిలబడిందో చూడండి."

ఈ కంఠ ధ్వని వైద్యురాలిది. ఆమె ఎవరిని గురించి మాట్లాడుతున్నది? ఎవరితో మాట్లాడుతున్నది? వెంకటేశ్వర్లకు అర్థము కాలేదు.

"దా... దా... నాదగరికిరా... మమ్మీ మీద కోపము వచ్చిందా?"

ఇది స్పష్టముగా మగగొంతు-డాక్టరు శర్మదయి ఉంటుందనుకున్నాడు వెంకటేశ్వర్లు.

"అబ్బ! దీని కెంతకోపమనుకున్నారు? నేను హాస్పిటలకు వెళ్లుతూ మొన్న దీనిని కారులో కూర్చొపెట్టుకొని తీసుకొని వెళ్లుతున్నాను. అక్కడ నాతోకూడా పనిచేసే డాక్టరు తనకారు చెడిపోయిందని ఈకారులో వస్తానంటే సరేనని ముందు సీటులో కూర్చోమన్నాను. అస్థలము దీనిదట... ఎంతలాగినా అక్కడనుంచి లేక మారాము చేసింది. నేను బలవంతముగా ఎత్తుకొని నాఒడిలో కూర్చొబెట్టుకున్నాను. ఆకోపము మనసులో పెట్టుకొని ఆరోజంతా నాదగ్గరికి రాలేదు."

తరువాత ముద్దుపెట్టుకొన్న శబ్దము వినిపించింది వెంకటేశ్వర్లకు.

'అయితే...ఊరివారందరికీ జన్మనిరోధము గురించి ఉపన్యాసాలిచ్చి-బిడ్డలను కనవద్దని ఉపదేశించిన డాక్టరు పంకజవల్లీ శర్మ ఇంట్లో చేసేది ఈ పనా? ఈమెకూడా పిల్లలను కన్నదికదా...' అని విస్మితుడైనాడు వెంకటేశ్వర్లు.

అంతలో కళ్లు జిగేలుమనే రంగుచీర కట్టుకొని ప్రక్క తలుపు తెరచుకొని బయటికి వస్తూ 'ఆలస్యమైనట్లుంది... రండి వెళ్లుదాము' అంటూ కారును సమీపించింది వైద్యురాలు.

'ఎంత వైద్యులైనా-స్త్రీలకు ఇంటినుంచి బయటికి రావాలంటే ఎంతో సర్దుబాటు కావాలి' అని నవ్వుతూ వెంకటేశ్వర్లు అక్కడనుండి కదిలి కారుదగ్గరికి వచ్చి 'నా సైకిలు ఇక్కడే ఉంచుతాను. తరువాత తెప్పించుకుంటాను' అని కారులో ముందుసీటులో కూర్చున్నాడు.

గదిలోనుండి వరెండాలోకి వచ్చి నిలువబడిన ఆయన డాక్టరు శర్మ అయిఉంటాడు-ఎరుపుడాలుగల కుక్కను ఎత్తుకొని 'మమ్మీని చూడు... తొందరగా రమ్మని చెయ్యి ఊపు' అంటూ కుక్కకు ముద్దు పెట్టుకుంటున్నాడు!


వెంకటేశ్వర్లకు కలిగిన ఆశ్చర్యానికి అంతులేదు. 'ఈ కుక్కపిల్లల సంతానముతో ఆనందిస్తూ తనను ఎంతసేపు వాకిట్లో నిలబెట్టింది వైద్యురాలు బాగున్నది! అయినా... ఇద్దరూ బాగా సంపాదిస్తూ-మంచి ఆరోగ్యముగా ఉన్న దంపతులు కదా... ఈ కుక్కపిల్లలనూ కుందేలు పిల్లలనూ పెంచుతూ పిల్లల సరదా తీర్చుకోవటము ఏంకర్మము?' వెంకటేశ్వర్లు తనకు కలిగిన విస్మయమును దాచుకోవలేక ముఖము మీదికి కనబరచాడు.

తన కుక్కను చూచి సంతోషపడుతున్నాడనుకొని 'ఏమండీ మా జెనీ స్వీట్ గా లేదూ?' అని వెంకటేశ్వర్లను ప్రశ్నించి 'డార్లింగ్! టా ... టా ...' అంటూ చెయ్యి ఊపింది డాక్టరు పంకజవల్లీ శర్మ.

డాక్టరు శర్మ తిరిగి 'టా...టా...' అంటూ కుక్కపిల్ల చేత చెయ్యి ఊపించాడు.

వైద్యదంపతుల సంతానపు ముచ్చటలను చూసి 'ఏమి నాగరికము!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు. అతడికా విస్మయములో భార్య ప్రసవవేదనను గురించిన తలంపులు కొంతసేపటివరకూ దూరమైనవి! ★

## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నికొక్క, నిస్సత్తువ శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. వి. ఏ. & కంపెనీ. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి-నెల్లూరు జిల్లా.